www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025

ఒకరికి కారుణ్య నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ ఉత్తర్వులను కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అందించారు. నగరపాలక కార్యాలయంలో పీహెచ్ వర్కరుగా పని చేస్తున్న వేదవతి ఈ ఏడాది మార్చిలో మృతి చెందారు. వేదవతి కుమారుడు జె.దుర్గాప్రసాద్‌కు కారుణ్య నియామకం కింద ఆఫీస్ సబార్డినేటర్‌గా గురువారం ఉత్తర్వులను అందించారు. ఎంహెచ్వో డాక్టర్‌పి.లోకేష్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాన్ని అందిస్తున్న కమిషనర్

సద్వినియోగం చేసుకుంటే... సదా అవకాశం

- గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాస్తకూస్తో అభివృద్ధి పథంలో పయనిస్తుంటే.. గిరిజనుల జీవనశైలి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీనికి కారణం వారిలో నెలకొన్న నిరక్షరాస్యత.. ప్రభుత్వ పథకాలు దరికి చేరకపోవడం, వలస జీవులుగా గ్రామాలు తిరుగుతున్న వీరికి సరైన స్థిర నివాసం కూడా లేకపోవడం ఒక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. వీరిని అన్ని విధాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ ఆధార్ కేంద్రాల ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్ (పూతలపట్టు): ఆర్థిక అభివృద్ధిలో అట్టడుగున ఉన్న గిరిజనులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని యోచిస్తోంది. సరైన ఆధార్ కార్డుల అనుసంధానం లేకపోవడంతో... ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు, పథకాలు అందడం లేదు. ఆధార్ కార్డుల్లో నెలకొన్న కొన్ని తప్పిదాలు.. వలస జీవులుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లి వస్తుండడంతో చాలా మందికి ఆధార్ కార్డు లేకపోవడం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. అన్నిటికీ ముడిపడి ఉన్న ఆధార్ కార్డులు వీరికి శాపంగా మారింది. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకోవాలని తలిచింది. ఈ దిశగా అడుగులు వేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈ కార్యక్రమంలో గిరిజనులు తమ ఆధార్ కార్డుల్లోని తప్పులను సరి చేసుకోవడం.. ఆధార్ లేనివారు నూతన ఆధార్ కార్డులను పొందడం వంటివి జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుంటే గిరిజనులు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల ద్వారా కొంతవరకు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని అంచనా వేస్తున్నారు.

జిల్లాలోని పరిస్థితి..

చిత్తూరు జిల్లాలో మొత్తం 60 వేల మంది గిరిజనులు ఉండగా.. ఇందులో సుమారు 1000 మందికి ఆధార్ సమస్యలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 10 ఆధార్ కేంద్రాల ఏర్పాటుచేసి గిరిజనులకు ఆధార్ సమస్యలను పరిష్కరించే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుంది. ప్రతి గిరిజన గ్రామంలో 6 నుంచి 7 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. గత రెండు నెలలుగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి..

గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకోవడంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని వారు అన్ని విధాలుగా సద్వినియోగం చేసుకోవలసి ఉంది. ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసిన గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు వలసలు వెళ్లకుండా ఆధార్ సమస్యలను పరిష్కరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులకు అన్ని విధాలుగా సహకరిస్తే వారి జీవన శైలిలో మార్పు తథ్యం.

ఆధార్ సమస్యలు 75శాతం పూర్తి..
- మూర్తి, గిరిజన సంక్షేమ శాఖ పీడీ

జిల్లాలో ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ కింద గిరిజనుల ఆధార సమస్యలను 75శాతం పూర్తి చేసాం. జిల్లా కలెక్టర్ సహకారంతో గత ఏడాది నుంచి చిత్తూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగింది. మరో 25శాతం పూర్తి చేయాల్సి ఉంది. గిరిజనులు వలసలు వెళ్లడం వల్ల అందుబాటులో లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. త్వరలోనే మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని 100శాతం పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. గిరిజనులు అన్ని విధాలుగా ఆదుకోవాలి.

ప్రభుత్వ బడులకు కొత్త అయ్యోర్లు

- 1,408 మంది నియమాకం
- వచ్చే నెల 11 తరువాత ప్లేస్‌మెంట్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మెగా డీఎస్సీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,408 మంది ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. వీరికి గురువారం విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అర్హత పత్రాలను అందజేశారు. మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా అర్హత సాధించిన 1,408 మంది స్కూల్ అసిసెంట్స్, సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు అక్టోబర్ 3వ తేదీ నుండీ చిత్తూరులో పది రోజుల పాటు బోధనా పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారు. 11వ తేదీ నుండీ వెబ్ అప్షన్స్ ద్వారా జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను అభ్యర్థులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

వెబ్ అప్షన్స్‌లో ఏ పాఠశాలల్లో ఎన్ని పోస్టులు, ఏఏ సబ్జెట్లు అనే విషయాన్ని విద్యాశాఖ ప్రకటిస్తుంది. వెబ్ అప్షన్స్ ఎంపిక కోసం రెండు, మూడు రోజులు అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. తరువాత జిల్లా విద్యాశాఖ అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించి ప్లేస్‌మెంట్ నియామక పత్రాలు ఇవ్వనున్నారు.

ఇక ప్రభుత్వం భర్తీ చేసిన ఉపాధ్యాయుల పోస్టుల విషయానికి వస్తే ప్రభుత్వ లోకల్‌బాడీ, ముస్సిపాలిటీ, మున్సిపల్ కార్పోరేషన్, ట్రైబల్ వెల్‌ఫేర్, అక్రమ 1,478 నోటిఫైడ్ చేసింది. 1,408 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసింది. వివిధ కారణాలతో 70 పోస్టులు భర్తీకి నోచుకోలేదు. ఏది ఏమైనప్పటికీ మెగా డీఎస్సీ ద్వారా కొత్త బడిపంతుళ్ళు నియమించబడ్డారు. ఏళ్ల తరబడీ డీఎస్సీ వాయిదాల తరువాత మెగా డీఎస్సీ ద్వారా కొత్త పంతుళ్ళు విధుల్లో చేరనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,803 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 3,36,422 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కొత్తగా ఉపాధ్యాయులుగా నియమితులవుతున్న అభ్యర్థులను నూతన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం కలవరపెడుతోంది. నియామకాలు పారదర్శంగా ఉపాధ్యాయుల అప్షన్స్ ఆధారంగా విద్యాశాఖ అధికారులు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.

కౌంటర్ దాఖలులో అలసత్వం తగదు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ప్రధాన కోర్టులో నమోదైన రెవెన్యూ కేసులకు సంబంధించి సకాలంలో స్పందించి కౌంటర్‌లు దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తహశీల్దార్‌లను ఆదేశించారు. గురువారం జిల్లాలో రెవెన్యూ కేసులు పెండింగ్‌కు సంబంధించి జిల్లా కలెక్టర్, డిఆర్ఓ మోహన్‌తో కలసి తహశీల్దార్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయస్థానంలోని 14 కోర్టుల పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 59 కేసులు ఉన్నాయని, అందులో 27 కేసులు ఎక్స్ పార్టీగా గుర్తించడం జరిగిందన్నారు. వీటికి సంబంధించి వెంటనే కౌంటర్లు దాఖలు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన భాధ్యత తహశీల్దార్లపై ఉంటుందని తెలిపారు. మండలాల పరిధిలో నమోదైన కేసులకు సంబంధించి పూర్తి బాధ్యత తహశీల్దార్లు తీసుకోవాలని, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా రెవెన్యూ చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కేసుల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వ జిపిని సంప్రదించి సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. ఈక్ష్మి కోర్టు వెబ్సైటులో కేసుల వివరాలు, స్థితిని పరిశీలించుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఎక్స్ పార్టీగా ఉన్న కేసులు అన్నింటికీ 2 రోజులలో రిటర్న్ స్టేట్మెంట్, కౌంటర్లు వేయాలని ఆదేశించారు. జిల్లా కోర్టులోని రెవెన్యూ కేసులకు సంబంధించి తహశీల్దార్లను సమన్వయపరచేలా విఆర్ఓ స్థాయి సిబ్బందిని లైజన్ అధికారిగా నియమించడం జరుగుతుందన్నారు.

అంగన్వాడీ కార్యకర్తకు గుండెపోటు

అంగన్వాడీలను భయపెట్టడం మానుకోవాలి
యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- కుప్పం

కుప్పం ప్రాజెక్టులో నిరంతరం ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీలపై జులుం ప్రదర్శించడం దారుణమని, వెంటనే వారిని భయపెట్టడం మానుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపి.లలిత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం సెక్టార్ 5 సమావేశంలో అధికారులు అంగన్వాడీలను రకరకాల సూటిపోటి మాటలతో మానసికంగా హింసించడంతో ఓ వర్కర్ భయాందోళనకు గురై గుండె నొప్పితో ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని తెలిపారు. డాక్టర్లు భయాందోళన గురి కావడంతోనే ఇలా జరిగిందని స్పష్టంగా చెబుతున్నారని, అంగన్వాడీలు ఏం తప్పు చేస్తున్నారని ఆ విధంగా భయాందోళనకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఈ విధంగా జరుగుతున్నాయని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, గతంలో పోరాటం చేసిన సందర్భంగా ఓ సూపర్వైజర్ క్రిమినల్ కేసులు పెడతామని బెదిరింపులు, మాటలు మరవకు ముందే మళ్లీ వేధింపులు గురి చేయడం, ఇలా అంగన్వాడీలను ఆస్పత్రిపాలు చేయడం దారుణమన్నారు. సిడిపిఓ సూపర్వైజర్ నిరంతరం ఇలా చేస్తున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అంగన్వాడీల ప్రాణాలతో చెలగాట మాడవద్దని, భయపెడితే పనిచేస్తారని అనుకోవడం అవివేకమని అన్నారు. ఇప్పటికైనా కుప్పం ప్రాజెక్టులో అధికారుల వైఖరి మారకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్వాడీ టీచర్

పారిశుధ్య కార్మికులపై పనిభారం తగ్గిద్దాం: కలెక్టర్

పారిశుద్ధ్య కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు బాధ్యతతో అవగాహనతో మెలగాలని కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. స్వచ్ఛతాహీ సేవ 2025లో భాగంగా గురువారం చిత్తూరు గంగినేని చెరువులో 'ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత' కార్యక్రమాన్ని కలెక్టర్, మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సదర్భంగా పార్కులో వ్యర్థాలను తొలగించారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచడం కోసం వందల మంది పారిశుద్ధ్య కార్మికులు వేకువజాము నుంచే పనిచేస్తున్నారని, 50 శాతం చెత్త మన ద్వారానే ఉత్పత్తి అవుతోందన్నారు. ప్రజలు బాధ్యతగా.. బిస్కెట్ కవర్లు, వాటర్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు రోడ్లపై పడేయకుండా అవగాహనతో వ్యవహరిస్తే పారిశుద్ధ్య కార్మికులపై పనిభారం తగ్గించడమే కాకుండా నగరం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. మేయర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులకు ప్రజలు సహకరించాలన్నారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, కార్పొరేటర్లు ఇందు పాల్గొన్నారు.

విజయపురం (నగరి): ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది శ్రమదానంతో పట్టణ పరిధిలోని పార్కును శుభ్రపరిచారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిబ్బంది శ్రమదానంతో పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలను తొలగించి శుభ్రపరిచారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని, రోడ్లపై, కాలువల్లో చెత్త వేయరాదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

నగరిలో..

పలమనేరు: మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో స్థానిక బాపూజీ పార్కులో చెత్తా చెదారాలను శుభ్రం చేయడంతోపాటు చెట్లు నాటడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఒక్కరూ నెలలో ఒక్క రోజు ఒక్క గంట కేటాయించి చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయత్నించాలని కోరారు. పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు శ్రీపురం సీతారామయ్య, నరసింహులు, సిద్దయ్య, మున్సిపల్, మెప్మా సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పలమనేరులో..

రేపు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సమావేశం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో 27వ తేదీ శనివారం మండల స్థాయి విజిలెన్స్ మానిటరి కమిటీ సమావేశం 10.30 గంటలకు జరుగుతుందని తహశీల్దార్ ప్రసన్న కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారాలు, గ్రామస్థాయి అధికారులు పాల్గొననున్నట్టు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో ఉపరాష్ట్రపతి, సిఎం

చిన్నశేష, హంసవాహనాలపై మలయప్ప

ప్రజాశక్తి - తిరుమల: భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు ఉపరాష్ట్రపతి చేరుకోగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. వేదాశీర్వచనం అనంతరం వారికి స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. అటు తరువాత 2026 సంవత్సరానికి సంబంధించిన టిటిడి క్యాలెండర్లు, డైరీలను ఉపరాష్ట్రపతికి అందించారు.

చిన్నశేష, హంసవాహనాలపై మలయప్ప

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై గురువాయూరు శ్రీకృష్ణడి అలంకారంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఏనుగులు, అశ్వాలు ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, మంగళ వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ వాహనసేవ అత్యంత రమణీయంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, సివిఎస్వో మురళికృష్ణ పాల్గొన్నారు.

ప్రశంసలు అందుకున్న తుడా ఛైర్మన్

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి తుడా ఛైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రశంసలు అందుకున్నారు. తుడా ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు నెలల వ్యవధిలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపిస్తూ కూటమీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో మరింత నమ్మకాన్ని కల్పిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి పనితీరును నారా చంద్రబాబు నాయుడు వారు మెచ్చుకుంటూ ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి డాలర్స్ దివాకర్ రెడ్డిని మెచ్చుకుంటూ ప్రశంసించారు.

డిజిటల్ జియోట్యాగ్స్‌తో సత్ఫలితాలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తప్పిపోయిన పిల్లలను పోలీసుల ఆధ్వర్యంలో డిజిటల్ జియో ట్యాగ్ సత్ఫలితాలను ఇస్తోంది. తప్పిపోయిన వారిని కుటుంబ సభ్యులకు సురక్షితంగా చేరుస్తోంది. మొదటిరోజే ఏడుగురు భక్తులను, రెండో రోజు ఐదుగురు పెద్దలు, ముగ్గురు చిన్నవారిని సురక్షితంగా అప్పగించారు. జియోట్యాగ్ సదుపాయం తిరుమలలో మాత్రమే కాకుండా తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్, టిటిడి సత్రాల్లో అందుబాటులో ఉంచారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో తిరుమల, తిరుపతిలో క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, తప్పిపోయిన వారిని గుర్తించి బంధువులకు చేరవేస్తున్నారు.

హెరిటేజ్ ఫుడ్స్ చిల్లింగ్ సెంటర్ ప్రారంభం

పాడి రైతులకు మద్దతు ఇవ్వడానికే కొత్త చిల్లింగ్ సెంటర్: నారా భువనేశ్వరి

చిల్లింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం)

గంగవరం మండలం గండ్రాజుపల్లి పంచాయతీ సరమట్లపల్లి సమీపంలోని హెరిటేజ్ ఫుడ్స్ చిల్లింగ్ సెంటర్‌ను గురువారం హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ ఛైర్‌పర్సన్, అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం హెరిటేజ్ రోజుకు 18 లక్షల లీటర్ల పాలను దేశంలోని 9 రాష్ట్రాల్లోని 9000 గ్రామాల నుండి 3లక్షల మంది రైతుల ద్వారా సేకరిస్తోందని, ఇందులో చిత్తూరు జిల్లాలోనే రోజుకు 3 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నామని తెలిపారు. పలమనేరు, పరిసర ప్రాంత పాడి రైతులకు మద్దతు ఇవ్వడానికి చిల్లింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఇది మొదట రోజుకు 10,000 లీటర్ల సామర్థ్యంతో ప్రారంభమై త్వరలోనే 20,000 లీటర్లకు విస్తరించబడుతుందని వెల్లడించారు. మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టితో ఈ సెంటర్‌లో 100శాతం మహిళా ప్రొక్యూర్‌మెంట్ ప్రతినిధులు పనిచేయనున్నారని, ప్రారంభదశలో 26 గ్రామాలకు సేవలు అందించి, త్వరలోనే 60 గ్రామాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. గత 33ఏళ్లుగా రైతులకు సంవత్సరానికి రూ.300కోట్లకు పైగా బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. రైతుల సంక్షేమం కోసం కంపెనీ ఉచిత జీపీఏ బీమా, పశు బీమా సేవలు, ఉచిత పశువైద్య శిబిరాలు, పశు దాణా సరఫరా, రుణ సహాయం వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ఇప్పటి వరకు 27 కుటుంబాలకు బీమా క్లెయిమ్స్ రూపంలో రూ.32.11 లక్షల సహాయం అందించామని తెలిపారు. హెరిటేజ్ పాల సేకరణశాఖ అధిపతి ఎస్. రామ్‌మోహన్ రావు, జోనల్ హెడ్ గోపాలకృష్ణన్, రైతు సంక్షేమ అధికారి డాక్టర్ బానోత్ శ్రీను, తిరుపతి రీజినల్ హెడ్ సర్వోత్తమరెడ్డి, ఆపరేషనల్ హెడ్ హరిబాబు, ఏరియా మేనేజర్ ఆదినారాయణ, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

మహిళల పొదుపుపై ఆడిట్

కడ పీడీతో సమావేశమైన మెప్మా అధికారులు

సంఘ మహిళలతో మాట్లాడుతున్న కడా పీడీ

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాలిటీ డీకేపల్లి పరిధిలోని డ్వాక్రా సంఘాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలంటూ డ్వాక్రా సంఘాల మహిళలు కడ పీడీ వికాస్ మర్మత్‌ను కోరారు. డీకేపల్లి పరిధిలో సుమారు 46 డ్వాక్రా సంఘాలుండగా గత వైసిపి హయాంలో డ్వాక్రా సంఘాలకు సంబంధించి ప్రతినెలా చెల్లించిన పొదుపు డబ్బును బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేశారని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మహిళలు కోరారు. ఇటీవల ఒక గ్రూపుకు సంబంధించి ఆడిటింగ్ చేస్తే సుమారు రూ.9,30,000లు దాకా నిధులు పక్కదారి పట్టినట్లు తేలిందని, మిగతా గ్రూపులకు సంబంధించి ఆడిటింగ్ చేసి పొదుపు సొమ్మును స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మహిళలు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన పీడీ మెప్మా అధికారులతో సమావేశమయ్యారు. డ్వాక్రా సంఘాల పొదుపు సొమ్ము స్వాహా పై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మిగిలిన సంఘాలకు సంబంధించి మహిళల పొదుపు సొమ్ము ఏ మేరకు బ్యాంకులో జమ అయ్యింది ఎంత పక్కదారి పట్టింది అన్నదానిపై పూర్తిస్థాయిలో ఆడిట్ చేయించి చర్యలు తీసుకుంటామని పీడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఏఎంసి ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, కో క్లస్టర్ తిరుమగళ్, నబి, గని, సిఎంఎం మనోహర్ రెడ్డి, సిసి శోభ, సీవో స్వాతి పాల్గొన్నారు.

అక్టోబర్‌లో పార్కు పనులు ప్రారంభం

కడ పీడీ వికాస్ మరమ్మత్

ప్రజాశక్తి-కుప్పం: పట్టణంలోని జమీందారీ పార్క్ అభివృద్ధి పనులను అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించినట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. గురువారం సాయంత్రం జమీందారీ పార్కు పరిసర ప్రాంతాలను కడ పీడీ, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, టిడిపి అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. జమీందారీ పార్కు తోపాటు షాపింగ్ కాంప్లెక్స్, డ్రైనేజీ, గెస్ట్ హౌస్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను వచ్చే నెలలో ప్రారంభించడం జరుగుతుందని పీడీ తెలిపారు. పార్కు ముందు భాగంలో ఉన్న దుకాణదారులకు ప్రత్యామ్నాయం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కుప్పం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్కు దుకాణదారులతో సైతం త్వరలోనే సమావేశమై వారికి ఇబ్బంది కలగకుండా ఏ విధంగా ప్రత్యామ్నాయం కల్పించాలని అన్నదానిపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, రెస్కో డైరెక్టర్ అర్ముగం, ఆర్‌ఆర్.రవి, వేణు, గిరి, అశోక్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ రణభేరిలో జిల్లా కార్యదర్శి సరిత

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కార వేదిక యుటిఎఫ్ రణభేరి అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. గురువారం రాష్ట్ర పిలుపుమేరకు గుంటూరులో జరిగిన రణభేరి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 25 శాతం ఉన్న ఏక ఉపాధ్యాయ పోస్టులను ప్రస్తుత ప్రభుత్వంలో 40 శాతం అయ్యిందని, ఇది కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగై పేద విద్యార్థులకు విద్య దూరమవుతారని అన్నారు. ప్రభుత్వం పభుత్వ బడులను బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

పాడి పరిశ్రమపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి): జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలకు 86,700 పశువులను కొనుగోలు చేయడానికి డీఆర్డీఏ పీడీ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్డీఏ సంస్థ చేపడుతున్న పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ ప్రాధాన్యత కలిగి ఉండగా, జిల్లాలో పశుపోషణ కార్యక్రమాల అమలుకు అత్యంత అనుకూలమైన అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో పశువుల పెంపకాన్ని, సంబంధిత పాడి అభివృద్ధి చేయడానికి సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కువ ప్రైవేటు డెయిరీలు, 35 ప్రభుత్వ బల్క్‌మిల్క్ చిల్లింగ్ సెంటర్లు ఉన్నాయని పాల ఉత్పత్తి అవసరం విరివిగా ఉండటం కనుక ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, పథక సంచాలకులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. అలాగే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సిఐఎఫ్, అంతర్గత రుణాలు ఇంటర్నల్ లెండింగ్ వంటి ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించి ఆరోగ్యకరమైన పశువులను కొనుగోలు చేయాలని సూచించారు. పశువుల పెంపకం, పశుగ్రాసం పెంపకంపై కూడా వ్యవసాయశాఖ ద్వారా అవగాహన కల్పించి నాణ్యమైన గడ్డి విత్తనాలను సరఫరా చేయాలని తెలిపారు.

అంటువ్యాధులపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: వర్షాకాలంలో ఎపిడమిక్స్ రాకుండా ముందస్తు ప్రణాళికలతో ప్రతి 1000 జనాభాకు ఉన్న ఆశ కార్యకర్త మొదటగా కనుక్కొని ఎఎన్ఎంకు ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని, ఎఎన్ఎం సర్వే చేసి మెడికల్ ఆఫీసర్‌కు తెలపాలనిస్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్లు వెంటనే జాగ్రత్తలు తీసుకుంటూ జిల్లాకు ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని, కీటక జనిత వ్యాధులు, నీటి కలుషితం వల్ల వచ్చే డయేరియా అతిసార ప్రబలకు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాజిటివ్ వచ్చినచోట మెడికల్ క్యాంప్ నిర్వహించి మరణాలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అన్ని రకాల మరణాలను 24 గంటల లోపల రిజిస్టర్ చేయాలన్నారు. సాధారణ కాన్పులన్నీ తప్పనిసరిగా పిహెచ్సి, సిహెచ్సిలో చేయాలని హైరిస్క్ కేసులు మాత్రం జిల్లా ఆసుపత్రికి వారం ముందు రిఫర్ చేయాలన్నారు. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా కాన్పులు చాలా తక్కువగా ఉండాలని తెలిపారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ లేకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అబార్షన్ పై నిఘా పెట్టి ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. డాక్టర్లు అనిల్ కుమార్, అనుష, గిరి, నవీన్ తేజ్రాయ్, జార్జి, వేణుగోపాల్, జయరాముడు, శ్రీవాణి, రామ్మోహన్ పాల్గొన్నారు.

తహశీల్దార్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా

బాధితుల ధర్నా

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి - పలమనేరు: కొర్జుల, చట్టాల పలమనేరు తహశీల్దార్‌కు వర్తించవా అంటూ తహశీల్దార్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు వాల్మీకి సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఏపీ వాల్మీకి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సికె చంద్రయ్య పేరున నాగమంగళం బైపాస్ రోడ్డు సర్వే నెంబర్ 47/6 విస్తీర్ణం 0.82 సెంట్ల భూమిని ప్రభుత్వం వారు 2005లో పట్టా ఇచ్చారని, అప్పటినుండి చంద్రయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారని తెలిపారు. కొన్నేళ్ల క్రితం చంద్రయ్య మరణించడంతో భార్య రాజేశ్వరమ్మ బాధ్యత తీసుకొని ఇతరులకు కౌలుకిచ్చి పంటలు పండించేదని తెలిపారు. ఆ భూమిని ఏపీఐఐసీ వాళ్లు, తహశీల్దార్ కుమ్మక్కై లాక్కోవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. పలుమార్లు స్థానిక తహశీల్దార్ పోలీసు బలగాలతో ఆమెను బెదిరించారని ఆర్జీవ భావనికి ఫిర్యాదు చేశారు. భూమి విషయంలో పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నెంబర్ 130/2025, ఐఏ నెంబర్ 317/2025గా కేసు జరుగుతున్నదని, కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ కోర్టు, చట్టాన్ని ఉల్లంఘిస్తూ పదేపదే భూమిలోకి వెళ్లడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని ఆరోపించారు. ఈ విషయంపై ఆర్జీవ భావని మాట్లాడుతూ బాధితులతో ఫిర్యాదులో జతపరిచిన రికార్డులను తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన తరువాత చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ఉన్నిగానిపల్లి పంచాయతీ గులిపల్లి గ్రామంలో కూటమి నేతల సహకారంతో విద్యుత్ సమస్య పరిష్కరించారు. గురువారం గ్రామంలో నూతన 100 కెవి ట్రాన్స్ ఫార్మర్ అమర్చారు. నూతన రెన్కో పాంతవర్గంలో గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించినందుకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ మునస్వామి, మాజీ సర్పంచ్లు రామ్మూర్తి, శ్రీనివాసులు రెడ్డి, జయశంకర్, కృష్ణారెడ్డి, మహేంద్ర నాయుడు, శంకరాచలం, గోపి, కేశవ నాయుడు, సంపంగి రెడ్డి, ఆంజనేయులుపాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

వీ కోటలో..

ప్రజాశక్తి - వి కోట: మహిళల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన స్వస్థ నారి స్వశక్త పరివార్ అభియాన్‌లో ప్రతి మహిళ భాగస్వామ్యం కావాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన వీకోటలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడంతోపాటు వారికి సమయానుకూల ఆరోగ్య సేవలు అందించాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డిపిఆర్‌సి కోఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ పిఎన్.లక్ష్మి, ఈవో నరేష్ పాల్గొన్నారు.

విజయపురం (నగరి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన స్వస్థనారీ సశక్తపరివార్ అభియాన్‌లో భాగంగా మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి జ్యోతి ప్రజ్వలనచేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తపోటు, మధుమేహం, కేన్సర్ సంబంధిత వైద్య చికిత్సను అందించారు. అలా కింద 243 మంది, స్త్రీ సమస్యలతో 103 మంది, చిన్నపిల్లలు 6, అనీమియాతో 92, ఎన్‌సీడీ 5, డయాబెటిస్ 8, ఈఎన్‌టి29 మంది, సాధారణ వ్యాధులతో 61 మంది చికిత్స అందుకున్నారు. ముగ్గురు రక్తదానం చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్ఎంఓ డాక్టర్ ఆర్వి మంజుల, వైద్యులు కార్తికేయ, జరీనా పాల్గొన్నారు.

సోమల (సదుం): స్వస్థ నారి స్వశక్తి పరివార్ వైద్యశిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు సూచించారు. విద్యార్థి దశలో పౌష్టికాహారం తీసుకోవాలని ఆరోగ్యంగా ఉండాలని సదుం ఎంపీడీవో రాధారాణి అన్నారు. బూరగమంద సబ్ సెంటర్ వద్ద వైద్య శిబిరాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం అంగన్వాడీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి అంగన్వాడీలు మహిళలకు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి చరణ్, సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి, మనీషా, రషీద్, దీప పాల్గొన్నారు.

యాదమరి: శక్తివంతమైన కుటుంబాల నిర్మాణానికి మహిళ ఆరోగ్యమే ఎంతో ప్రాధాన్యమని తహశీల్దార్ పార్థసారథి పిలుపునిచ్చారు. గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి సక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బి.అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ మహిళలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో పెంచల వీరేంద్ర, హెల్త్ సూపర్వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాని, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రనాథ రెడ్డి పాల్గొన్నారు.

రామకుప్పం: స్వస్తిక్ నారి పరివార్ అభినయ్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని విజలాపురం ప్రాథమిక ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ పూజిత సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ బోర్డ్ డైరెక్టర్ మునస్వామి, రామ్మూర్తి, శ్రీనివాసులు రెడ్డి, జయశంకర్, నాగభూషణం, కుమార్, కృష్ణారెడ్డి, శంకరాచలం పాల్గొన్నారు.

కుప్పం: మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిప్యూటీ డిఎంహెచ్వో గంగాదేవి పేర్కొన్నారు. స్వస్త నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కుప్పం మున్సిపాలిటీ కమతమూరు అర్బన్ హెల్త్ సెంటర్లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవల గురించి నోడల్ ఆఫీసర్ సుభాష్ రాజా వివరించారు. రాష్ట్ర నేత గోపీనాథ్, కౌన్సిలర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

సోమలలో..

క్రైం న్యూస్

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

ఒకరు మృతి, 9 మందికి గాయాలు

ప్రజాశక్తి - రొంపిచర్ల

ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా మరో 9 మంది మహిళలు తీవ్రంగా గాయపడిన సంఘటన బెంగళూరు– తిరుపతి జాతీయ రహదారి పైన గురువారం ఉదయం 6 గంటలకు జరిగింది. బాధితుల కథనం మేరకు రొంపిచర్ల మండలంలోని రామచంద్రపురం కాలనీ, పిచ్చిగుంట్లవారి పల్లి, మూరేవాండ్లపల్లి గ్రామాలకు చెందిన మహిళలు అన్నమయ్య జిల్లాలోని కలకడ మండలంలో టమాటా తోటల్లో రోజువారి కూలీలుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు పనికి వెళ్లే క్రమంలో గురువారం ఉదయం కూడా 14 మంది మహిళలు ఆటోలో కలకడకు బయలుదేరారు. అయితే జాతీయ రహదారిలోని పెద్ద గొట్టిగల్లు గ్రామం బోనంవారిపల్లి సమీపంలో నేషనల్ హైవేపై వెళుతుండగా పీలేరు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పిచ్చిగుంట్లవారిపల్లికు చెందిన అలివేలమ్మ (53) మృతిచెందారు. అలాగే మూరెవాండ్లపల్లికి చెందిన పి.రత్నమ్మ, పి.లక్ష్మీదేవి, పి.శాంతమ్మ, టి.నారాయణమ్మ, పి.కమలమ్మ, పి.నారాయణమ్మ, రామచంద్రపురం కాలనీకి చెందిన పి.రాణి, ఎం.రాములమ్మ, పిచ్చిగుంట్లవారిపల్లి చెందిన రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో బాధితులను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. సంఘటన స్థలాన్ని రొంపిచర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాదారులకు నగలు అప్పగించేందుకు చర్యలు

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యూనియన్ బ్యాంక్‌లో గత సంవత్సరం నవంబర్ నెలలో 24 మంది ఖాతాదారుల బంగారు నగలు తాకట్టు లోన్ల విషయంలో జరిగిన అక్రమాలపై బ్యాంక్ అంతర్గతంగా నిర్వహించిన ఆడిట్‌లో అవకతవకలు బయటపడ్డాయని దీంతో యాదమరి పీఎస్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్పై మహేశ్వర్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈ కేసు దర్యాప్తులో ఇప్పటివరకు ఆరుగురు నిందితులపై కేసులు నమోదు చేశారని, వారిలో నిందితులు అబ్బూరి భాస్కర్ ఆచారి, అవినాష్, కుడిమి దర్శిని, టి.మాలిక్, పటాలం మురళి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని, నిందితుల్లో ఒకరైన మాధవరం గ్రామానికి చెందిన భువనేశ్వరి మృతిచెందారని తెలిపారు. ఈ కేసులో సంబంధిత 24 మంది ఖాతాదారుల అసలైన బంగారు ఆభరణాల విలువ రూ.65 లక్షలుగా నిందితుల నుంచి పూర్తిగా రికవరీ చేసి కోర్టుకు సమర్పించారని, కోర్టు ఉత్తర్వుల మేరకు బ్యాంకు మేనేజర్ నగలను తిరిగి ఖాతాదారులకు తమ లోన్ మొత్తాన్ని చెల్లించిన తరువాత వారికి వాటిని అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కేసుపై విచారణ కొనసాగుతోందని ప్రజలు ఎటువంటి కలత చెందవలసిన అవసరం లేదన్నారు. బాధితులకు న్యాయం చేయడం, ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యతగా కొనసాగుతుందన్నారు.

క్వారీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జీడి నెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలం వనదుర్గపురం సమీపంలోని గుట్టలో అక్రమ మైనింగ్, గ్రావెల్ నిలిపివేయాలని, మైనింగ్ రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముందు నిరసన కార్యక్రమం జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు మాట్లాడుతూ పాలసముద్రం మండలంలో అక్రమంగా క్వారీలను నిర్వహిస్తూ గుట్టలను పూర్తిగా సదును చేస్తూ పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నారని, మట్టిని తమిళనాడుకు తరలిస్తూ పంచాయతీకి టాక్సీ రూపంలో వస్తున్న లక్షలాది రూపాయలను గండి కొడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా మైనింగ్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. కారకులైన వారిపై చర్యలు తీసుకొని అక్రమ క్వారీలను నిలిపివేయాలని, కొండలను గుట్టలను పర్యావరణాన్ని ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు.

చిత్తూరులో మెడికల్ క్యాంప్

రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ప్రాంతంలోని గుండె సంబంధిత సమస్యలు ఉన్న రోగులు నరువి హాస్పిటల్ వైద్య నిపుణుల నుండి నేరుగా చికిత్స పొందే అవకాశం కల్పిస్తూ గురువారం వైద్యశిబిరం ప్రారంభించారు. చిత్తూరు ప్రీతం హాస్పిటల్, వేలూరు నరువి హాస్పిటల్ సంయుక్తంగా ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నాయి. చిత్తూరు ప్రాంతంలోని గుండె రోగులు, నరాల సంబంధిత రోగులు చికిత్స కోసం వేలూరు నరువి ఆసుపత్రికి వచ్చే సమయం, ఖర్చును తగ్గించడానికి, నరువి హాస్పిటల్ వైద్యనిపుణులు చిత్తూరులో నేరుగా చికిత్స అందించగలిగేలా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం నేటి నుండి చిత్తూరు ప్రీతం హాస్పిటల్‌లో ప్రారంభమైంది. ఈ శిబిరం నెలకు రెండుసార్లు జరుగుతుందని ప్రీతమ్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర కుమార్, నరువి హాస్పిటల్ కార్డియాక్ సర్జన్లు డాక్టర్ వినాయక్ శుక్లా, డాక్టర్ రేజార్జ్ నరంబిల్, సర్జన్ డాక్టర్ లోకే తెలిపారు. శస్త్రచికిత్స అవసరమయ్యే రోగులకు వేలూరు నరువి హాస్పిటల్‌కు తరలించి శస్త్రచికిత్స చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సిఎంను కలిసిన మండల నేతలు

ప్రజాశక్తి- శాంతిపురం: శాంతిపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగం ఉదయ్ కుమార్ తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం కలిశారు. అక్టోబర్ 2న జరగబోవు వారి అన్న నందిగం గురుప్రసాద్ కుమారుడు నందిగం కౌశిక్ పెళ్లి రావాలని కోరుతూ పెళ్లి పత్రికను అందించి ఆహ్వానించారు. వారి వెంట మండల నాయకులు ఆర్ఎస్.మనీ, చంద్ర శేఖర్, గిరిధర్, లోకేష్, ఆంజనేయ రెడ్డి ఉన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించండి

ప్రజాశక్తి - కార్వేటి నగరం: కార్వేటినగరం బజారువీధిలో చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణదారులు నిర్మించున్న ఆక్రమణదారులు అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి పేర్కొన్నారు. బజార్ వీధిలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడడం వల్ల, రాబోయే నెలలో షుగర్ ఫ్యాక్టరీకి ఎక్కువగా ఈ మార్గంలో చెరుకు ట్రాక్టర్లు ప్రయాణం సాగిస్తుంటాయని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ప్రజలు సహకరించి స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించి, దుకాణానికి ఎదురుగా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

పెద్దపంజాణిలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఇరికిపెంట పార్వతీనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మా కార్యక్రమాన్ని నిర్వహించి పౌష్టికాహారం వల్ల కలిగే లాభాల గురించి మహిళలకు గర్భవతులకు బాలింతలకు చిన్నారులకు తెలియజేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత మాట్లాడుతూ మండలస్థాయి పోషణ మా వేడుకను నిర్వహించడం జరిగిందని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భవతులు, బాలింతలు ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిచ్చి చిన్నారుల ఎదుగుదలకు అవకాశం ఉందని తెలియజేశారు. కామిరెడ్డివారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషణ మా వేడుక నిర్వహించినట్లు సూపర్వైజర్ హరిత తెలిపారు.

పెద్దపంజాణి: పిల్లల తల్లులకు, గర్భిణులకు పోషకాహార ప్రాముఖ్యతను వారికి తెలియజేయాలని ఎంపీడీవో బాలాజీ ఎంపీడీవో, సిడిపిఓ ఉమారాణి అన్నారు. గురువారం మండంలోని వెలుగు కార్యాలయంలో రాష్ట్రీయ పోషణ మాసం సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యం గురించి అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ పోషకాహారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో మన వంతు పాత్ర పోషిద్దామని అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, వెలుగు ఏపీఎం నీరజ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కల్పనా, లత, మండల ప్రాథమిక వైద్యాధికారి మురళి, అంగన్వాడీ వర్కర్లు వీవో లీడర్స్ పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేయాలి: తహశీల్దార్

బైరెడ్డిపల్లిలో..

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఈ పంటను నమోదు చేయాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి భారతి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేలు, రైతు సేవాకేంద్రం సిబ్బంది గ్రామాల్లో రైతు పండిస్తున్న పంటలను నమోదు చేయాలన్నారు. రైతుకు కావలసిన ఎరువులు, రాయితీలు గుర్తించని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ పంటను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేలు, వీఆర్వోలు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: రైతులకు మద్దతు ధరల కల్పన, పంట నష్టపరిహారాలు, సాగునీటి హక్కులు వంటి లబ్ధి కోసం ఈ పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ అధికారులు ఆదేశించారు. గురువారం తహశీల్దార్ కార్యాయలంలో మండల వ్యవసాయ అధికారి గీతా కుమారి ఆధ్వర్యంలో ఈ పంట నమోదుపై నిర్వరహించిన సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది, వ్యవసాయ విభాగాధికారులు పాల్గొన్నారు. రైతులు ఎలాంటి అవాంతరాలు లేకుండా తమ పంటలను నమోదు చేసుకోవాలని అందుకు ఆర్బీకే సిబ్బందికి సహకారం అందించాలని ఈవో సూచించారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుంది: ఆర్‌కె రోజా

మంజు బాలాజీ ఎంపీపీ బాధ్యత స్వీకరణ

ప్రజాశక్తి- విజయపురం

హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైయిందని మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శిమచారు. విజయపురం ఎంపీపీ జమున అనారోగ్య కారణంగా రాజీనామా చేయడంతో జిల్లా కలెక్టర్ నుంచి మంజు బాలాజీని ఎంపీపీగా ఉత్వర్వులు అందుకున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ఎంపీపీ బాధ్యత స్వీకరణ మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని నూతన ఎంపిపిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడ్డదారిలో అధికారం చేపట్టిందని, అందుకే ప్రజల్లో రావడానికి భయపడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తున్నా పార్టీ నాయకులు, కార్యకర్తలలో బలంగా ఉన్నారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజలు అన్నిటికీ క్యూ కడుతున్నారని, పింఛన్ తొలగిస్తున్నారని మండి పడ్డారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే రానున్న స్థానిక ఎన్నికలలో మన పార్టీ విజయం సాధించడం ఖామమన్నారు. నూతన ఎంపిపి బాలాజీ మాట్లాడుతూ వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా తమకు అప్పగించిన బాధ్యతకు న్యాయం చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా పని చేస్తానని అన్నారు. రాష్ట్ర నాయకులు గుణశేఖర్‌రెడ్డి, గోవర్ధన్ నాయుడు, శేఖర్‌రాజు, మండల కన్వీనర్ శివరాజు, బూత్ కన్వీనర్ ప్రసన్న, రామకృష్ణమరాజు, నిండ్ర ఎంపీపీ దీప, నగరి జెడ్పీటీసీ గాంధీ, మున్సిపాల్ హరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కె.రోజా

ఎంపీపీగా బాధ్యత స్వీకరిస్తున్న మంజు బాలాజీ

వీధి విక్రయదారుల కోసమే లోక కళ్యాణ్ మేళా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వీధి విక్రయదారుల అభివృద్ధి కోసమే పీఎం స్వానిధి 2.0 లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. గురువారం నగరపాలక కార్యాలయంలో పీఎం స్వానిధి 2.0 లోక్ కళ్యాణ్ మేళాపై బ్యాంకు అధికారులు, మెప్మా ఆర్పీలు, సీవోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధివిక్రయదారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పీఎం స్వానిధి 2.0 కార్యక్రమాన్ని లోక కళ్యాణ్ మేళా ద్వారా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులైన, గుర్తింపు పొందిన వీధి విక్రయదారులను గుర్తించి వారికి సంబంధిత బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలు నాణ్యత పాటించాలని, క్షేత్రస్థాయిలో నిజంగా వ్యాపారం చేసే వారిని గుర్తించి, రుణాలు అందించడం ద్వారా.. రీపేమెంట్ సక్రమంగా జరుగుతుందన్నారు. జీవోలు, ఆర్పీలు క్షేత్రస్థాయిలో వీధి విక్రయదారులకు అవగాహన కల్పించాలని, బ్యాంకు వారితో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, మెప్మా డీపీఎంయు రవి, సీఎంఎం గణేష్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

విజయపురం (నగరి): పిఎం స్వనిధి 2.0 లోక కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి కోరారు. గురువారం స్థానిక మెప్మా కార్యాలయంలో పిఎం స్వనిధి 2.0 లోక కళ్యాణ్ మేళా పథకంలో 200 మంది వీధి వ్యాపారులు, చిరువ్యాపారులకు వారి కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు, చిరువ్యాపారులకు 2.0 లోక కళ్యాణ్ మేళా పథకం ద్వారా రూ.15ల నుండి రూ.50వేల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తొలి విడతలో రూ.10 వేల నుంచి 15 వేలు, రెండవ విడతలో రూ.20 వేల నుండి రూ.25 వేలు, మూడవ విడతలో రూ.50వేల వరకు రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వీధి విక్రయదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలకు దరఖాస్తులు చేసుకోదలచిన వారు మెప్మా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏకాంబరకుప్పం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, లేబర్ డిపార్టుమెంట్ సిబ్బంది, మెప్మా సిటీ మేనేజర్ ఎస్.ప్రసాద్, మెప్మా రిసోర్స్ పర్సన్లు, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 1st ADDL
JUNIOR CIVIL JUDGE CHITTOOR
I.A.NO. 233 OF 2024
O.S.NO. 635 OF 2018

Between:
V. Madhukumar and another ...Petitioners/ Plaintiffs.
And
Smt. Sampoornamma and 5 others ...Respondents/Defendants
To
NOTICE TO THE 1, 2, 3, 4, 5 AND 6TH RESPONDENTS / DEFENDANTS.
1. Smt. Sampoornamma, W/o Munirathnam Reddy, Hindu, aged about 80 years, dependent,
2. S. Jyothi, W/o late Viswanatha Reddy, Hindu, aged about 50 years, housewife,
3. S. Santh Kumar, S/o Viswanatha Reddy, Hindu, aged about 30 years, private employee,
4. S. Madhan, S/o Viswanatha Reddy, Hindu, aged about 27 years, private employee,
5. S. Mallikarjuna Reddy, S/o Munirathnam Reddy, Hindu, aged about 51 years, Farmer,
6. S. Ramalinga Reddy, S/o Munirathnam Reddy, Hindu, aged about 47 years, working as a Police Constable,
The above said 1,2,3, 4, 5 and 6th Respondents/Defendants residing at: Thalapulapalle Village and Post, Puthalapattu Mandal, Chittoor District, A.P.
Sir, Please take the notice that the petitioner/ plaintiff filed in the above I.A.No. 233 of 2024 in O.S.No. 635 of 2018 against you and to add the parties about yourself in I.A.No. 233 of 2024 in O.S.No. 635 of 2018 of the 1st Addl.Junior Civil Judge, Chittoor and the said petition/suit posted on 16-10-2025 at about 10-30 a.m. for your appearance either in person or through your Advocate in the above said court on the above said date if youare failed to appear on that day the matter will be decided in your absence.
Sd/- S.SUBRAMANYAM REDDY
Advocate for Petitioner/Plaintiff
Place: Chittoor, Date: 25.09.2025

IN THE COURT OF THE 1st ADDL
JUNIOR CIVIL JUDGE CHITTOOR
I.A.NO. 234 OF 2024
O.S.NO. 635 OF 2018

Between:
V. Madhukumar and another ...Petitioners/ Plaintiffs.
And
Smt. Sampoornamma and 5 others ...Respondents/Defendants
To
NOTICE TO THE 1, 2, 3, 4, 5 AND 6TH RESPONDENTS / DEFENDANTS.
1. Smt. Sampoornamma, W/o Munirathnam Reddy, Hindu, aged about 80 years, dependent,
2. S. Jyothi, W/o late Viswanatha Reddy, Hindu, aged about 50 years, housewife,
3. S. Santh Kumar, S/o Viswanatha Reddy, Hindu, aged about 30 years, private employee,
4. S. Madhan, S/o Viswanatha Reddy, Hindu, aged about 27 years, private employee,
5. S. Mallikarjuna Reddy, S/o Munirathnam Reddy, Hindu, aged about 51 years, Farmer,
6. S. Ramalinga Reddy, S/o Munirathnam Reddy, Hindu, aged about 47 years, working as a Police Constable,
The above said 1,2,3, 4, 5 and 6th Respondents/Defendants residing at: Thalapulapalle Village and Post, Puthalapattu Mandal, Chittoor District, A.P.
Sir, Please take the notice that the petitioner/ plaintiff filed in the above I.A.No. 234 of 2024 in O.S.No. 635 of 2018 against you and to add the parties about yourself in I.A.No. 234 of 2024 in O.S.No. 635 of 2018 of the 1st Addl.Junior Civil Judge, Chittoor and the said petition/suit posted on 16-10-2025 at about 10-30 a.m. for your appearance either in person or through your Advocate in the above said court on the above said date if youare failed to appear on that day the matter will be decided in your absence.
Sd/- S.SUBRAMANYAM REDDY
Advocate for Petitioner/Plaintiff
Place: Chittoor, Date: 25.09.2025

IN THE COURT OF THE 1st ADDL
JUNIOR CIVIL JUDGE CHITTOOR
I.A.NO. 235 OF 2024
O.S.NO. 635 OF 2018

Between:
V. Madhukumar and another ...Petitioners/ Plaintiffs
And
Smt. Sampoornamma and 5 others ...Respondents/Defendants
To
NOTICE TO THE 1, 2, 3, 4, 5 AND 6TH RESPONDENTS / DEFENDANTS.
1. Smt. Sampoornamma, W/o Munirathnam Reddy, Hindu, aged about 80 years, dependent,
2. S. Jyothi, W/o late Viswanatha Reddy, Hindu, aged about 50 years, housewife,
3. S. Santh Kumar, S/o Viswanatha Reddy, Hindu, aged about 30 years, private employee,
4. S. Madhan, S/o Viswanatha Reddy, Hindu, aged about 27 years, private employee,
5. S. Mallikarjuna Reddy, S/o Munirathnam Reddy, Hindu, aged about 51 years, Farmer,
6. S. Ramalinga Reddy, S/o Munirathnam Reddy, Hindu, aged about 47 years, working as a Police Constable,
The above said 1,2,3, 4, 5 and 6th Respondents/Defendants residing at: Thalapulapalle Village and Post, Puthalapattu Mandal, Chittoor District, A.P.
Sir, Please take the notice that the petitioner/ plaintiff filed in the above I.A.No. 235 of 2024 in O.S.No. 635 of 2018 against you and to add the parties about yourself in I.A.No. 235 of 2024 in O.S.No. 635 of 2018 of the 1st Addl.Junior Civil Judge, Chittoor and the said petition/suit posted on 16-10-2025 at about 10-30 a.m. for your appearance either in person or through your Advocate in the above said court on the above said date if youare failed to appear on that day the matter will be decided in your absence.
Sd/- S.SUBRAMANYAM REDDY
Advocate for Petitioner/Plaintiff
Place: Chittoor, Date: 25.09.2025